# స్నేహితుడి భార్య

"నేను సినిమాకు పోతున్నాను" అన్నాడు మొగుడు.

'ఈ సినిమా ఏమిటో నాకు తెలుసు!' అనుకున్నది భార్య. "నేను కూడా రానా?" అన్నది.

"ఆఁ! మంచిసినిమా కాదు. నిద్రపట్టక పోతున్నాగాని."

'ఈ నిద్రపట్టకపోవటమూ నాకు తెలుసు!' అనుకున్నది భార్య.

ఇవ్వాళ ఎనిమిదిన్నర పాసెంజరుకి ప్రసాదరావు బెజవాడ వెళ్లాడు. ఇంటి దగ్గిర నీలవేణి ఒంటరిగా ఉంటుంది. అయ్యగారు తొమ్మిందిటికే సినిమా వంక పెట్టి వేంచేస్తున్నారు!

ఎట్లా చేస్తారో మగవాళ్లింత దుర్మార్గం? తన స్నేహితుడి భార్య కదా?

వాళ్లిద్దరికి – తన భర్తకూ, నీలవేణికి – ఏదో సంబంధం ఉండవచ్చునని ఇవాళ ఉదయమే తనకు అనుమానం పోవడమూ, ఆ అనుమానం కాస్తా ఇప్పుడే రుజువు కావడమూనూ!

నిజానికి తన భర్తకంటే ప్రసాదరావు ఎన్నో రెట్లు అందగాడు. అతనిమీద తనకు ఎన్నిసార్లు బుద్ధిపోలేదు? తను తూలిందా?

నీలవేణి – పేరు నాజూకేగాని, తనకంటే ఏ విధంగా అందకత్తె? తలుచుకున్నకొద్దీ మండిపోతున్నది... ఈపాటికి తన భర్త ప్రసాదరావు గారింటికి సగం దూరంలో ఉంటాడు... ఆమె చివాలున లేచింది. దీపం తగ్గించి, తలుపులన్నీ దగ్గరగా వేసి బయటికొచ్చింది. బయటి తలుపు గొళ్లెంపెట్టి ప్రసాదరావుగారింటికేసి బయలుదేరింది.

ఆటే దూరంలేదు. అదే ప్రసాదరావుగారిల్లు. తన భర్త జాడ ఎక్కడాలేదు. రోడ్డు లాంతర్లున్నచోట తప్ప అంతా చీకటి. అంతా నిశ్శబ్దం. చలికాలం కావటం మూలాన రోడ్డుమీద ఒక్క పురుగు లేదు. తొమ్మిందిటికే.

ఎదురుగా ఎవరో వస్తున్నారు. ఆమె గుండె గుబుక్కుమన్నది. ఆమో! ప్రసాదరావు! రైలుకు పోనేలేదు. ఇంటికి తిరిగి వస్తున్నాడు. పెళ్లాం రహస్యం తెలిసిందో ఏమో!

అతన్ని లోపలికి వెళ్లనివ్వరాదు. కొంపపోతుంది.

ఆమె నాలుగడుగులు ముందుకు నడిచి ప్రసాదరావును సమీపించింది.

ప్రసాదరావు నిర్ఘాంతపోయినాడు.

"ఏవమ్మా ఎవరికోసం? ఎక్కడికి?" అన్నాడు అతను. తను నవ్వింది. ఇంకా నయం, నవ్వగలిగింది.

"మీకోసమే!" అంది తరువాత అతనేమనుకున్నా సరే!

"నా కోసమా! నా ప్రయాణం ఆగిపోయిందని ఎట్లా తెలిసిందీ?"

"మీరు కూడా ప్రయాణమైనారని నాకు తెలీదు."

"పోనివ్వండి, నాతో ఇప్పుడేం పని?"

"మీతో ఒక అరగంటసేపు రహస్యంగా మాట్లాడాలి."

అతను నమ్మటంలేదు. "మా గొడ్లపాకలో కూర్చుందామా?"

తను సరేనన్నది.

అతను ఒక నులకమంచం వాల్చి "కూచోండి!" అన్నాడు.

తను కూచుని అతని చెయ్యిపట్టుకు బలవంతాన కూచోపెట్టింది. అతనికి అర్థమయింది.

"ఈ ఆలోచన ఎంతకాల నుంచీ?" అన్నాడతను దగ్గరికి జరిగి.

"మనం చాలా తప్పు చెయ్యబోతున్నాం. నాకు నీమీద ఎంతకాలంనించో ఉంది. స్నేహితుడి భార్యవని చంపుకున్నాను... అదీకాక మా ఆవిడంటే నాకు చాలా గౌరవం."

"మీ ఆవిడ! అయ్యోరాద!" అనుకుంది తను.

"ఈ వెధవ గొడ్లపాకా ఏమిటి? మనం మీ యింటికి పోదాం" అన్నాడతను.

"మా యింటికా? వద్దు!"

"ఏం మీ ఆయన ఇంట్లో లేడుగా!"

ఆమె చివాలున లేచింది. ఇతనికంతా తెలుసు. తను నిష్కారణంగా శీలం చెడగొట్టుకున్నది.

"ఎట్లా తెలుసు?" అన్నది వణుకుతున్న గొంతుతో.

"వాడు సినిమాకు వెళుతూ దారిలో నాక్కనిపించాడే!"

తను ఇక అక్కడ ఒక్కక్షణం ఉండలేదు. పరిగెత్తింది. వెనకనించి దయ్యాలూ, భూతాలూ తరుముకొస్తున్నట్లు పరిగెత్తి కడప్రాణంతో వచ్చి కొంపలో పడి తలుపు బిడాయించుకున్నది.

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*
*యువ కార్యాలయం, తెనాలి*